క్లుప్తంగా

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి


రైతులతో మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ చీఫ్ ఇంజనీర్ ఎ.కామేశ్

పెన్‌పహాడ్ : వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ చీఫ్ ఇంజనీర్ ఎ.కామేశ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం రాత్రి మండల పరిధిలోని దూపహాడ్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రైతులను విద్యుత్ సరఫరాపై వివరాలు అడిగి తెలుసుకుని మాట్లాడారు. అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి వేసవిలో విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేసే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట సూర్యాపేట ఎస్ఈ బి.ఫ్రాంక్లిన్, డీఈ టెక్నికల్, ఏఈలు ఉన్నారు.

బాక్స్ క్రికెట్ జోన్ ప్రారంభం


బాక్స్ క్రికెట్ జోన్‌ను ప్రారంభిస్తున్న ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

సూర్యాపేట : పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల పక్కన చల్లా దిలీప్‌రెడ్డి, మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్‌వీసీ స్పోర్ట్స్ జోన్‌ను ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి, పీసీసీ సభ్యుడు కొప్పుల వేణారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువత ఉద్యోగం చేసుకుంటూ వ్యాపారంలోకి రావడం శుభపరిణామమన్నారు. పట్టణాల్లో బాక్స్ క్రికెట్ ట్రెండ్ పెరుగుతోందన్నారు.

ఎక్స్‌రే క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి


ఎక్స్‌రే క్యాంపును పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కోటాచలం

తిరుమలగిరి (తుంగతుర్తి) : వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఎక్స్‌రే క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి కోటాచలం కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన ఎక్స్‌రే క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. 60సంవత్సరాలు పైబడి షుగర్, బీపీ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఎక్స్‌రే తీయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వందన, శిరీష, స్వరూపకుమారి, రాజు, నర్సింహరెడ్డి, శ్రీలత, ధనమ్మ పాల్గొన్నారు.

3నుంచి యోగా-ధ్యానోత్సవాలు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అర్వపల్లి : అర్వపల్లిలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 3నుంచి జరిగే ఉచిత యోగా-ధ్యానోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శనివారం అర్వపల్లిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సూర్యాపేట సెంటర్ ఇన్‌చార్జి ఎస్.గోవర్ధనగిరి, ప్రశిక్షకులు ముసునూరి వెంకటరంగారావు, నూకల ఉపేందర్, అభ్యాసకులు శేఖర్, వెంకటేష్, దడిపల్లి వెంకట్, మేకల సత్యనారాయణ, ఉష, వెన్నెల, వెంకట్‌రెడ్డి, రంజిత్, జ్యోతి, రజిని, ఉమ, లక్ష్మి, వీరయ్య, రమేష్, వేణు పాల్గొన్నారు.

మైనింగ్ పనులు అడ్డగింత


మైనింగ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తొండ గ్రామంలో సర్వే నంబర్ 98లో జరుగుతున్న మైనింగ్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా అసిస్టెంట్ మైనింగ్ అధికారి విజయరామరాజు, తహసీల్దార్ హరిప్రసాద్ శనివారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. ఈ సర్వే నంబర్‌లో రైతు వేదిక, డంపింగ్ యార్డు, క్రీడా స్థలాలను ఏర్పాటు చేశారని తెలిపారు. దాని పక్కనే రూ.300 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, మైనింగ్ చేయడంతో ఇవన్నీ దెబ్బతిన్నాయన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు

- ఎండిపోతున్న వరిపొలాలు
- మూగజీవాలకు మేతగా మారుతున్న పంటలు


నీరు లేక ఎండిన ఏపూరు ఏరు


నెమ్మికల్లు శివారులో ఎండిన వరిపొలంలో మేస్తున్న గొర్రెలు

ఆత్మకూర్ (ఎస్) : మండలంలో తాజా పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయి. భూగర్భజలాలు భారీగా పడిపోవడంతో వరిపొలాలు ఎండుతున్నాయి. దీంతో పంటలను దక్కించుకోవడానికి రైతులు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. పలు చోట్ల చేసేది లేక ఎండిపోతున్న పొలాలను మూగజీవాలకు మేతగా వదిలేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే వేసవిలో పంటలు సగానికి కూడా దక్కించుకునే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొద్ది రోజుల్లోనే తగ్గిన భూగర్భజలాలు..

ఎన్నడూ లేనంతగా ఈ సంవత్సరం అధిక వర్షాలు కురిశాయి. దీంతో ఆయా గ్రామాల చెరువులు నిండడంతో పాటు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. నీరు సమృద్ధిగా ఉందని రైతులు సంతోషంతో ఎక్కువ మొత్తంలో వరిని సాగుచేశారు. కాని ఊహించని విధంగా కొద్దిరోజుల్లోనే భూగర్భజలాలు పడిపోవడంతో బోర్లు తగ్గి పంటలు ఎండే పరిస్థితికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోరు బావులపైనే ఆధారం..

ఆత్మకూరు మండలం నాన్ ఆయకట్టు ప్రాంతం కావడంతో రైతులు ఎక్కువగా బోరు బావులు కిందనే ఆధారపడి సాగు చేస్తున్నారు. కాగా గత నాలుగు, ఐదు సంవత్సరాల నుంచి ఎస్సారెస్పీ నీరు వస్తుండడంతో మెట్ట భూములన్నింటిని వరికి అనుకూలంగా చదునుచేశారు. ఎస్సారెస్పీ నీరురాని సమయంలో వాడుకోవడానికి ఇటీవల ఎక్కువ సంఖ్యలో బోర్లను సైతం వేస్తున్నారు. వరి విస్తీర్ణం పెరగడం, బోర్లు పెరగడంతో పాటు 24గంటల కరెంటుతో వస్తుండడంతో భూగర్భజలాలు ఒక్కసారిగా పడిపోయాయని పలువురు రైతులు అంటున్నారు. నెల క్రితం వరకు నిండుగా ఉన్న ఏరు, చెరువులు వేసవి రాకముందే చుక్కనీరు లేకుండా పోవడంతో ఎండాకాలంలో పరిస్థితులు దారుణంగా ఉండే అవకాశాలు ఉంటాయని, పశువులకు తాగడానికి నీరు దొరకని పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎండిన రెండు ఎకరాలను పశువులకు వదిలేశా



బోర్ల మీద ఆధారపడి నాలుగు ఎకరాలు వరిసాగు చేశాం. ఇటీవల భూగర్భజలాలు తగ్గి బోరు సక్రమంగా పోయడం లేదు. దీంతో ఇప్పటికే రెండు ఎకరాలు పశువులకు మేతగా వదిలాను. మిగిలిన రెండు ఎకరాలు కూడా చేతికి వస్తుందని నమ్మకం లేదు. ఈ సంవత్సరం పంట నష్టపోవాల్సి వస్తుంది.

– దాసరి గోపి, రైతు, ముక్కుడుదేవులపల్లి

ఎస్సారెస్పీతో చెరువులు నింపాలి



చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. ప్రభుత్వం ఎస్సారెస్పీ ద్వారా చెరువులు, కుంటలు నింపాలి. దీంతో భూగర్భజలాలు పెరిగి పంటలు చేతికి వచ్చే అవకాశం ఉంటుంది. ఇష్టారీతిన బోర్లు వేయకుండా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి.

– మున్నా గణేష్, యువ రైతు, ఇస్తాళ్లాపురం

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి


చివ్వెంల : బొడ్రాయికి పూజలు చేస్తున్న జగదీష్‌రెడ్డి

చివ్వెంల : పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని రోళ్లబండతండాలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భూక్యా సంజీవ్‌నాయక్, మాజీ సర్పంచ్ బానోతు బుజ్జి, ఖాసీం నాయక్, భావ్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

కుటుంబాలకు పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పల్లెపంగు మధన్ సతీమణి రాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండమీది గోవిందరావు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పీఏసీఎస్ చైర్మన్‌లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాం రెడ్డి, వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారావు ఉన్నారు.

ఆలయంలో జీవధ్వజ ప్రతిష్ఠ వేడుకలు


పూజలు చేస్తున్న అర్చకులు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో 3రోజుల పాటు జరగనున్న జీవధ్వజ పునర్ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా మొదటి రోజు శనివారం సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ విజయకుమారి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3న జరిగే జీవధ్వజ పునర్ ప్రతిష్ఠ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో శ్రీసంతోషిమాత దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రాహ్మాండ్లపల్లి మురళీధర్, గోపారపు స్వరూపరాణి, నీరజ, ఓరుగంటి కరకరత్నం, పురుషోత్తం పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎల్‌డీఎం, బీఎం, ఏపీఎంలు

అర్వపల్లి : మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ (ఎల్‌డీఎం) బాపూజీ అన్నారు. అర్వపల్లిలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం ఆర్‌బీఐ, ఎస్‌బీఐలు సంయుక్తంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని కోరారు. అందుకోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. కాగా మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందడానికి బ్యాంక్ ఇచ్చే వివిధ రకాల రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ మేనేజర్ బధావత్ రామకృష్ణ కోరారు. సమావేశంలో డీపీఎం ఆంజనేయులు, ఏపీఎం వలిశెట్టి మల్లేష్, సీసీ నగేష్, అకౌటెంట్ లింగంపల్లి ఈశ్వరి, వీఓఏలు, డ్వాక్రా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సువెన్ పరిశ్రమ ఎదుట కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న కార్మికులు

సూర్యాపేట : పట్టణంలోని సువెన్ పరిశ్రమ యజమాన్యం సక్రమంగా జీతాలు చెల్లించలేదని పరిశ్రమ ఎదుట కార్మికులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంక్రిమెంట్లు, బోనస్‌లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ఎన్నిసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. 250మంది కార్మికులు విధులు బహిష్కరించి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సువెన్ ఫార్మా కంపెనీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న ధర్నాకు సీఐటీయూ జిల్లా మద్దతు తెలిపింది. శనివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ధర్నాలో పాల్గొని మాట్లాడారు. గతంలో 600మంది ఉన్న కార్మికులు కొత్త యాజమాన్యం వచ్చిన తర్వాత 180వరకు కుదించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, వెంకన్న, రవి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి


వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

నాగారం : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని హెచ్‌ఎం ఆర్.జానకి అన్నారు. శనివారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.శ్రీనివాసులు, బి.కిష్టయ్య, వీరయ్య, హేమమాలిని, జానకిరాములు, సుధాకర్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం


చివ్వెంల : అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


తిరుమలగిరి (తుంగతుర్తి) : నివాళులర్పిస్తున్న నాయకులు


తుంగతుర్తిలో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట : పట్టణంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు వల్దాస్ జానీ(జే) ఆధ్వర్యంలో అన్నదానం ప్రారంభించి మాట్లాడారు. జాతి కోసం అమరులైన మాదిగ అమరవీరుల ఆశయాలను సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాతాకుల రాజయ్యమాదిగ, ఎర్ర వీరస్వామి మాదిగ, జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు, బొజ్జ సైదులు మాదిగ, మేడి కృష్ణ మాదిగ, రాజు మాదిగ, చెరుకుపల్లి సతీష్ మాదిగ, బొజ్జ వెంకన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొంగల సతీష్, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి కిరణ్‌కుమార్, కొండ బుచ్చిబాబు, గోగుల బాబు, గోగుల రాజు, కలకొండ రాంబాబు, కొండ కిశోర్, గోగుల విష్ణు, గోగుల నరేందర్, కలకొండ సిద్ధూ, సోపంగి సాయి, గోగుల లోకేష్, గోగుల రాకేష్, కలకొండ థామస్, తిప్పర్తి మైసయ్య, గోగుల రమేష్, గోగుల రవి, పరశురామ్ తదితరుల పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషిచేయాలి

తుంగతుర్తి : మాదిగ అమరవీరుల ఆశయ సాధనకు కృషిచేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం ఖాసీం అన్నారు. శనివారం మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మిట్టగడ్పుల పురుషోత్తం, మల్లెపాక సాయిబాబా, కొండగడుపుల శ్రీనివాస్, మల్లెపాక రవీందర్, ఇరుగు సురేష్, బొంకూరి నవీన్, గడ్డం సోమేశ్వర్, పుల్లూరి అంబేద్కర్, పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎస్సీ వర్గీకరణ సాధించడమే మాదిగ అమరవీరులకు నిజమైన నివాళి అని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమయ్య అన్నారు. శనివారం పట్టణంలో గాంధీభవన్ దాడి సంఘటనలో గాయపడి మృతి చెందిన పొన్నాల సురేంద్ర, దామోదర్, మహేష్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తగట్టు మల్లయ్య, కడెం లింగయ్య, కందుకూరి శ్రీను, యాదగిరి, మోశా పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ములకలపల్లి రవి మాదిగ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణమాదిగ, ప్రధాన కార్యదర్శి తిప్పర్తి గంగరాజు మాదిగ, అధికార ప్రతినిధి మిర్యాల చిన్ని మాదిగ, పల్లెల నాగయ్య మాదిగ, కలకోట్ల ప్రసాద్ మాదిగ, బొల్లెపాక ముత్య లింగయ్య మాదిగ, నాగయ్య, సీతారాములు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలో మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వాయి బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్వాయి పరుశరాములు, గంగాధరి లక్ష్మీకాంత్, గంటా రవి, నకిరేకంటి మనోజ్, బత్తుల సురేష్, జాన్‌విల్సన్ పాల్గొన్నారు.

ఘనంగా జీఆర్ వివేకావాణి పాఠశాల వార్షికోత్సవం


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని జీఆర్ వివేకావాణి పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గుడిమళ్ల సంతోష్‌శర్మ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు అందజేత

ఆత్మకూర్(ఎస్) : కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జెభీమ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జై భీమ్ సోషల్ ఆర్గనైజేషన్ సలహాదారుడు గోనె నాగయ్య శనివారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జై భీమ్ సభ్యులు గోనె సాగర్, క్రీడాకారులు అల్లి శ్రీకాంత్, కొండ వేణు, వగ్గు వెంకన్న, చెన్నబోయిన సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌తో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది

అర్వపల్లి : అబాకస్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని అర్వపల్లి మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ విపిన్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన మెమోరి గణిత అకాడమి ఆధ్వర్యంలో స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో శనివారం విద్యార్థులకు అబాకస్ మెగా టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ విపిన్‌కుమార్ మాట్లాడారు. అబాకస్ టెస్ట్‌తో ప్రధానంగా గణిత ప్రావిణ్యం పెరుగుతుందన్నారు. ఈ అబాకస్ కోసం పాఠశాలలో ప్రత్యేకంగా ఒక సబ్జెక్టును, అలాగే ప్రత్యేక టీచర్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గిరిజ, హెచ్‌ఎం అమర్, ఉపాధ్యాయులు కె.చంద్రశేఖర్, రమ, రజిత, దేవేంద్ర, నిఖిత, నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని బండ్లపల్లిలో గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల నిర్మూలనపై తెలంగాణ సాంస్కృతిక కళా బృందం ఆధ్వర్యంలో శనివారం కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, పాన్‌మసాల, గుట్కా, సారా నిషేధంపై కళా ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలకుర్తి శ్రీకాంత్, నాగరాజు, సైదులు, ఉదయ్, రాధ, స్రవంతి, శిరీష ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

3న కంటి వైద్యశిబిరం

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో ఈ నెల 3న వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీ విజన్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావులు శనివారం తెలిపారు. 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్యశిబిరంలో పెన్షనర్లు తమ హెల్త్‌కార్డుల తో వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

మద్దిరాల : మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుండాల పెద్దచంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మృతుడికి ఐదుగురు కుమార్తెలు కావడంతో పెద్దకుమార్తె సువర్ణ తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టింది.

యూరియా కొరత లేకుండా చూస్తాం

అర్వపల్లి : మండలంలో యూరియా కొరత లేకుండా చూస్తున్నట్లు జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, సీఈఓ మేడబోయిన రామస్వామి తెలిపారు. అర్వపల్లిలోని పీఏసీఎస్‌కు శనివారం 440 బస్తాల యూరియా రాగా కొద్ది సేపట్లోనే రైతులు కొనుగోలు చేశారని తెలిపారు.

పంటలు చేతికొచ్చే వరకు నీటిని వదలాలి

అర్వపల్లి : యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన వరిపంటలు చేతికొచ్చే వరకు నీటి పారుదల శాఖ అధికారులు గోదావరి జలాలను విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

యుద్ధభేరి ధర్నాను విజయవంతం చేయాలి

సూర్యాపేటటౌన్ : హైదరాబాద్‌లో యూనిఫైడ్ పెన్షన్ స్కీంపై ఆదివారం జరిగే యుద్ధభేరి ధర్నాకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ శనివారం అన్నారు. ఈ ధర్నాకు సీపీఎస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బొడ్రాయి ఉత్సవాలకు విరాళం

నాగారం : మండలంలోని శాంతినగర్‌లో ఈ నెల 23, 24తేదీల్లో జరిగే బొడ్రాయి పునఃప్రతిష్ఠ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ రూ.25,000 వేల విరాళం ప్రకటించారు. శనివారం ఆయన పంపించిన నగదును పార్టీ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అంబయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలి

సూర్యాపేట : పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎల్గూరి గోవింద్, వన్‌టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ వన్‌టౌన్ కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టౌన్ కమిటీ సభ్యులు అర్వపల్లి లింగయ్య, వట్టే ఎర్రయ్య, మల్లయ్య, నాయకులు సైదమ్మ, రామ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

నూతనకల్ : మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని బిక్కుమళ్ల ఇసుక రీచ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. సమావేశంలో ఆర్ఐ హసన్, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో పంటలను కాపాడాలి

నూతనకల్ : శ్రీరాంసాగర్ రెండో దశ ద్వారా గోదావరి జలాలను అందించి పంటలను కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పులుసు సత్యం కోరారు. శనివారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఎర్రపహాడ్, దిర్శనపల్లి గ్రామాల్లో ఎండిపోయిన వరిపంటలను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పులసరి వెంకటముత్యం, లింగయ్య, రవి, లింగారెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

కరపత్రాల విడుదల

తిరుమలగిరి (తుంగతుర్తి) : హైదరాబాద్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ కన్వీనర్ వంగరి బ్రహ్మం కోరారు. శనివారం పట్టణంలోని పద్మశాలి సంఘం మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోవిందరావు, పట్టణ శాఖ అధ్యక్షుడు చింతకింది మురళీ, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం అభిలాష్, అంజయ్య, ఉపేందర్, ప్రవీణ్‌కుమార్, సోమనారాయణ, రామ్మూర్తి, కృష్ణ, సోమయ్య, ఉమేష్, మల్లయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

సూర్యాపేటటౌన్ : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట మండలంలోని టేకుమట్ల జాతీయ రహదారి వద్ద శనివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. శనివారం సాయంత్రం సమయంలో టేకుమట్ల వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయం కావడంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే అతడు ఎవరు అనేది తెలియలేదని, తెలిసిన వారు సూర్యాపేట రూరల్ ఎస్ఐ 87126 86030కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం


సూర్యాపేటటౌన్ : మాంటిస్సోరి పాఠశాలలో..


తుంగతుర్తి బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లో..


చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్ పాఠశాలలో..


పెన్‌పహాడ్ : చీదెళ్ల ప్రాథమిక పాఠశాలలో..



తిరుమలగిరిలో ..


జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో..